ఓం శ్రీరామచంద్ర పరబ్రహ్మణేనమః

# వివేక కౌముది



రచయిత

ఆంధ్రభాషావిశారద

## బగ్గాం సన్యాసప్పన్న కవి

(భాగవతార్)

ఓం శ్రీరామచంద్ర పరబ్రహ్మణేనమః

# వివేకకౌముది



రచయిత:

ఆంధ్ర భాషా విశారద

## బగ్గాం సన్యాసప్పన్న కవి

(భాగవతార్)

విశారద గ్రంథమాల,

చతుర్థ కుసుమము

సర్వస్వామ్యములు రచయితవి

మూల్యము

నాలుగు అణాలు

# ప్రస్తావన

మానవజాతికి వివేక విజ్ఞాన శీలములవశ్యకర్తవ్యములు. అట్టివి బాల్యదినుండియు పిల్లల కలవడఁజేయుట మాతాపితగురుజనుల ధర్మము. ఏలయన నేటిబాలకులే నాటిపౌరులుంగదా! కావున సులభశైలిలో నాయనుభవములోనున్న మంచివిషయములన్నిటి నొకటిగాఁజేర్చి కందపద్యములుగా విరచించి "వివేకకౌముది" యను పేరిడితిని. ఈ చిన్నపొత్తము ప్రాథమిక పాఠశాలలోని బాల బాలికల కెంతయు నుపయుక్తములుగా నుండునని నాయాశయము. ఈనాయభిప్రాయమును ప్రభుత్వమువారును, ఉపాధ్యాయలోకమును సార్థక మొనర్తురని విశ్వసించుచున్నాను.

దీనిని ముద్రించుటకు వలయుద్రవ్యసహాయ మొనర్చిన సన్మిత్ర మండలి కెంతయు కృతజ్ఞతా పూర్వక వందనములర్పించుచు, వారిపవిత్ర నామములనిందు పొందుపఱచితిని.

దీని నామూలాగ్రముఁదిలకించి సదభిప్రాయములొసంగిన పండిత మిత్రవర్గమునకు నావినయ వినమితాంజలు లర్పించుచున్నాను.

ఇట్లు
విద్వద్విధేయుడు
బగ్గాం సన్యాసప్పన్న కవి
(భాగవతార్)

రామభద్రపురము.
తే 25-3-1951

## ముద్రణార్థము ద్రవ్యసహాయము మొనర్చిన మిత్రమండలి.

| | | | రు.-అ.-పై |
|---|---|---|---|
| 1 | శ్రీ గొట్టిపాటి బుచ్చిఅప్పారావుగారు<br>విశాఖజిల్లాబోర్డు అధ్యక్షులు | విజినిగిరి | 58-0-0 |
| 2 | శ్రీ గొల్లు అప్పలనాయుఁడుగారు<br>విశాఖజిల్లాబోర్డు మెంబరు | రామభద్రపురము | 10-0-0 |
| 3 | శ్రీ రాపర్తి వెంకటరెడ్డి పంతులుగారు | విజినిగిరి | 20-0-0 |
| 4 | శ్రీ చిట్టిపంతులు అప్పలనరసయ్య<br>పంతులుగారు ఈనామ్‌దార్ | చామలాపల్లిఅగ్రహారం | 10-0-0 |
| 5 | శ్రీ పంతుల నరసింహం పంతులుగారు | డొంకాడఅగ్రహారం | 10-0-0 |
| 6 | శ్రీ అవధానుల నారాయణ సన్యాసిరావుగారు | ,, | 10-0-0 |
| 7 | శ్రీ రామయోగిగారు | ,, | 5-0-0 |
| 8 | శ్రీ రాజాన పరశురామునాయుఁడుగారు | ,, | 10-0-0 |
| 9 | శ్రీ కాగర సత్యనారాయణగారు | ,, | 5-0-0 |
| 10 | శ్రీ పైల అప్పలస్వామిగారు | ,, | 5-0-0 |
| 11 | శ్రీ పాండ్రంకి అప్పలనరసయ్యగారు | విశాఖపట్టణం | 5-0-0 |
| 12 | శ్రీ అల్లు రామమూర్తిగారు<br>ప్రెసిడెంటు కో-ఆపరేటివుసొసైటీ | గిట్టుపల్లి. | 5-0-0 |

# పండితాభిప్రాయములు

కవిశేఖర :- బ్రి॥ శ్రీ అడిదము రామారావుపంతులు (Retired Senior Telugu Pandit, M. R. College, Ex-member of the Board of studies in Telugu, Andhra University) గారొసంగిన అభిప్రాయము :-

శ్రీయుత బగ్గాం. సన్యాసప్పన్న కవి (భాగవతార్) గారు రచియించిన "వివేకకౌముది" అనునీతి కందపద్యశతకమును కవిగారేచదివి వినిపింపఁగా సాంతముగావిని మిగుల నానందించితిని. పద్యము లన్నియు హృద్యములై నీతిబోధకములుగానున్నవి శైలిచక్కని ధారాశుద్ధితోనలరారుచున్నది. ప్రతిపద్యము నేదోయొక లోకానుభవ విషయనివేదనముతోఁ గూడి నీతిని చెప్పునదిగానుండుట యిందుఁజూపట్టు గుణవిశేషము. రెండు, మూఁడు పద్దములుతప్ప పద్యములన్నియు బాలబాలికలకు పఠనార్హములై సులభములై, నిర్దుష్టములుగానున్నవి.

విద్యాశాఖాధికారులచే నియమింపఁబడిన పాఠ్యపుస్తకనిర్ణాయక సభవారీ చిఱుతకబ్బమును నామోదించి కవిగారికి ప్రోత్సాహము కలిగింతురుగాకయని కోరుచున్నాను. సభవారియామోదమును బడయఁగల యర్హత దీనికిఁగలదని నాయభిప్రాయము. ప్రాథమిక బడుల Elementary Schools )లో చదువుపిల్లలందఱు చదువుటకునిది యెంతయు తగియున్నది.

విజయనగరము, | ఇట్లు
తే 18-3-1951 | అడిదము - రామారావు.

శ్రీ బగ్గాం. సన్యాసప్పన్న కవి (భాగవతార్) గారు రచియించిన "వివేకకౌముది"నిచదివి మేముమిక్కిలిఆనందించినాము. ముఖ్యముగా నిందలిపద్యములు మృదుమధుర శైలితో పాఠకులకు సులభగ్రాహ్యములుగానున్నవి. ఈపొత్తముప్రస్తుత పాఠశాలలలోని బాలబాలికలు పఠించుచో వారికి వివేకవిజ్ఞానశీలము లలవడుననుటకావంతయు సందియము లేదు. ఇందలిగుణవిశేషములు కేవలకల్పితములుగాక ప్రత్యక్షముగా మానవులనిత్య

జీవితయాత్రలో ప్రతిఫలించుచున్నవి. కవిగారియొక్క లోకానుభవమును నీచిన్నిపాత్రముచాటుచున్నది. గానపాఠకులిందలి సారమును గ్రహించి ఆచరణలోనుంచిన జీవితవికాసమునందఁగలరని మాదృఢవిశ్వాసము.

ఇట్టి సద్గ్రంథములను సాధారణముగా పాఠశాలలలోని బాలబాలికలకు పాఠ్యగ్రంథములుగానుంచుట ప్రభుత్వ పాఠ్యపుస్తక నిర్ణాయక సభవారికెంతయు సమంజసకార్యమని మనవిచేయుచున్నాను.

ఇట్లు మిత్రద్వయము

మకాం:- విశాఖపట్టణం.
తే 22-3-51

గెడ్డం- సన్యాసిరావు M. L. A
జి. బి. అప్పారావు
అధ్యక్షులు విశాఖజిల్లాబోర్డు

N. RAJANRAJU, B.A.L.T., Station: *Vizianagram,*
Educational Department Date 25—3—51

శ్రీ బగ్గాం- సన్యాసప్పన్నకవి (భాగవతార్) విరచితవివేక కౌముదిని నేనామూలాగ్రముగాఁదిలకించితిని. కవిగారు నాకీ మూలముననే గాక నాపరీక్షాధికారము క్రిందనుండునొక ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయుఁడగుట నేనీతని సారస్వతసేవను, బోధనాపటిమను బాగుగా నెఱుఁగుదును.

ఈపాత్రమునందు పద్యములన్నియు సరళమగుభాషలో నీతి, వివేక, విజ్ఞానములను బోధించుచు మంచిశ్లోకోక్తులతో నలరారుచున్నవి. అందువలన నీగ్రంథమునకు 'వివేక కౌముది' యను పేరు సార్థకమగుచున్నది; మఱియు సులభశైలిలోనుంట పాఠశాలలోని బాల బాలికలకుఁ గూడ పఠనార్హములై యున్నవని జెప్పుటకు సందియములేదు.

(Sd) N. RAJANRAJ,
25—3—51
Deputy Inspector of Schools,
Vizianagram Range



ఆంధ్రభాషా విశారద

బగ్గాం సన్యాసప్పన్న కవి

(భాగవతార్)

ఓం పరమాత్మనే నమః

ఓం శ్రీగణేశ శారదా గురుభ్యోన్నమః

# వివేక కౌముది

౧ శ్రీ మత్పర తత్త్వము కృప
ధీమంతులు మెచ్చ మంచి తెలుఁగుల నెల్లన్
ప్రేముడి 'వివేక కౌముది'
నామంబున రచన సల్పినాఁడ వివేకీ!

౨ కవితంగాంచిన యందుకు
నవమార్గ సునీతి బోధనల లోకులకున్
బ్రవిమల మతి రచియింపని
కవితా వైఖరి యనర్థకరము వివేకీ!

౩ అర్థాపేక్షను దుర్మద
పార్థివులను బొగడి కవులు పద్దెములల్లన్
సార్థకమె బ్రతుకునందు, న
నర్థంబిహ పరములందు నగయు వివేకీ!

౪ ఒరులకు మేలొనరింపని
నరజన్మము సార్థకంబె నల్లులు, దోమల్
ధరలోఁ బుట్టవె, గిట్టవె
అరయఁగ ఫలమేమి దాన నగును వివేకీ!

౫ ఉన్నతునిఁ జూచి యోర్వక
కన్నులఁ దాఁగట్టుకొన్నఁ గలదే ఫల మి
క్కెన్నాళ్లు కొంగలేడ్చిన
వెన్నఁగ రాయంచలగుట యెట్లు? వివేకీ!

౬ చెడు సావాసము వలనన్
గడ కెన్నటికైన హీనగతి తథ్యంబౌ
పడిసెగఁ దాకిన, బూడిదఁ
బడవే నీరమునఁగూడు పాలు వివేకీ!

౭ సర్పంబు నోటఁ జిక్కిన
కప్ప యెదుటనున్న యీఁగ గబళించు విధం
బెప్పుడు మిత్తికి లోఁబడి
తప్పడు చేఁతలకు దిగుట తగునె? వివేకీ!

౮ కోరక విపత్తులే గతిఁ
జేరునో మానవులనట్లు సేరకయున్నే
ధారుణి శుభములు; కావునఁ
గోరంగా నేల? విమలగుణులు వివేకీ!

౯ సమయ మెఱిఁగి నటియించిన
సుమతికి శత్రులును మేలు చూపుదు రిలలో
క్రమ మెఱిఁగి తినిన నాభియు
నమితారోగ్య ప్రదంబయగును వివేకీ!

౧౦ హీనుఁడగువాని యందు, నొ
కానొక గుణమున్నఁ జేరఁగా నొల్లరిలన్
మానుగ విశ్వాసము గల
దైనను శ్వానమును ఛీ, ఛి యందురు వివేకీ !

౧౧ సుజనామోదకరుండగు
విజిత యశోన్వితుఁడు, కుజన విహితుండే? వా
రిజ మిత్త్రుఁడైన సూర్యుని
వృజినునిఁగాఁ జూచు ఘూకవితతి వివేకీ !

౧౨ ఉరుగుణుఁడు, కుజనుఁ డెడనెడ
సిరిగల్గిన వంగి, నిక్కి చెలఁగుదు కలిమిన్
వరి, జొన్నచేలు పండిన
ఒరగుట, నిక్కుటలు సాజముర్వి వివేకీ !

౧౩ సారగుణాన్వితులు, కృపా
పారీణులు తమదు మేలు పాటింప రిలన్
జేరఁజను దూడకీకుక
క్షీరము మనకిడదె గోవు చెలఁగి వివేకీ !

౧౪ కలిమి గలనాఁడు జాలిం
గల మనుజుఁడె మిన్న; లేని కాలమునందున్
గలిగిన ఫలమే? చిక్కిన
పులికిన్ గ్రూరత్వ మెడసి పోదె, వివేకీ !

౧౫ పరువంబు, కలిమి యెడసిన
తఱి నడకువ గలిగియుండు ధర నెవ్వండున్
జరచే నింద్రియ పాటవ
మరిగిన భామిని పతివ్రతౌనె? వివేకీ!

౧౬ బలియుఁడనని గర్వింపఁగ
ఫలమున్నదె? బుద్ధిబలమె బలమగుఁగాదే
బలిసిన యేనుఁగు మూఁపున
విలసితమతి మనుజుఁ డెక్కి వెలయు వివేకీ!

౧౭ ఏకార్యము లందైనన్
లోకువయగుచుండ్రి పరమలోభు లొరులకున్
కాకులచే పొదిగింపదె
కోకిల తనగుడ్ల స్వేచ్ఛఁగొనుచు వివేకీ!

౧౮ ధన మార్జించెడు లోభ్యుం
డనుభవమెటు పొందునేల యందున కడు రా
లిన గింజల చీపురు పో
వొనరించుట కాని దినునె యుర్వి వివేకీ!

౧౯ యాచన సల్పిన నెంతటి
ధీ చతురుఁడు హీనుఁడట్లు దిగనాడఁబడున్
ఆచంద్రమౌళి నైనన్
యాచన సేయుటను జంగమనరె వివేకీ!

౨౦ దిరిపం బెత్తుటకంటెను
మరణంబే శరణమెట్టి మనుజునికైనన్
సిరి దొరఁగ పరిజనంబుల
దరినుండుటకంటె మేలు దకులు వివేకీ!

౨౧ తనబ్రితుకు హీనమని, యి
న్యుని స్తుతియించుచు ఫలంబులొందుట కంటెన్
వనమున నాకలములఁ దిని
మనుటయె కడు లెస్సయగుసుమా సువివేకీ!

౨౨ తనవారైనను దుష్టులు
తన చెంగటనున్న హాని తప్పక కల్గున్
తన దీపశిఖల ముద్దిడ
వెనువెంటనె కాల్చకున్నవే? సువివేకీ!

౨౩ మాటల నాడెడువారలు
పాటొనరించుటలు కల్ల భౌ, భౌ మనుచున్
మాటికి మొఱఁగెడు కుక్కలు
కాటులు వేయంగ లేవుగాదె వివేకీ!

౨౪ మరణ జరారోగఁబులు
ధరలో జీవులకు నైజధర్మంబు లటం
చెఱిఁగియు, భీతింబొందుట
లరయఁగ నజ్ఞానవృత్తియగును వివేకీ!

౨౫ తనబ్రతుకు శాశ్వతంబని
మనమున గుర్తెఱిఁగి స్వార్థమానసు లొరులన్
దునుమాడ నెంతురు, మృత్యువు
వెనుకాడుచు వచ్చునీడ విధము వివేకీ!

౨౬ ఈమహి విజ్ఞాశక్తులు
ధీ మహిమను కొద్ది గొప్ప తెఱఁగుల వెలయున్
గోమూత్రి పతనమారయ
చీమకు ప్రళయంబుగాదె చెలఁగి వివేకీ!

౨౭ తా మొనరించెడు పనులన్
సామర్థ్యం బెంచ నేల, జనముల కృషికిన్
భూమి నసాధ్యముగలదే
చీమలు కొండలను దరుగఁ జేయు వివేకీ!

౨౮ తన పృష్ఠ భాగమితరులు
గనిపను పురివిప్పి యాడుగద నెమ్మి ధరన్
తన కులగౌరవ మెంచఁడు
పనులందున హీనజనుఁడు పరగ వివేకీ!

౨౯ తన మలిన మాత్మలోపల
తనుదాఁ దర్శింపఁ దెలియఁడగు దుర్జన, స
జ్జను లొకరి తెఱఁగుఁ దోఁచరె
గనుగొన్న నాముదము, తేనె కరణి వివేకీ!

౩౦ పనిచేయక భోగపరా
యణుఁడై మనువాఁడు కృషికు లగువారలకున్
ఋణపడుఁ గావున, నెప్పుడు
పనిచేయమి హైన్యమగును బ్రదుకు వివేకీ !

౩౧ మిక్కిలి తాఁ గోరిన ఫల
మెక్కుడు దవ్వగుట సాజమిల నెవ్వరికిన్
గ్రక్కున నదృష్టయుతునకు
నెక్కడ కేఁగినను వెంట నేఁగు వివేకీ !

౩౨ అనుకూలపు దాంపత్యం
బనునది నగరమున నటవినైనను సుఖమే
కన నెద్దు, బండి యొకకై
సన పర్వతమైన నెక్కఁజనదె వివేకీ !

౩౩ చనువిచ్చి ప్రేమతోఁ జూ
చినకొలఁదియు సాధ్వి లొంగి చెలఁగు; కులట తాఁ
బెను మురహాంకృతిఁ గొను, కు
క్కను ముద్దిడ మూఁతినాకుఁ గదర వివేకీ !

౩౪ తనుదాఁ బొగడుకొనంగా
వినుత యశోండగునె ధాత్రి వేవిధములుగా
తనకుచము తాన మర్దిం
చిన కామము దీరునెట్లు స్త్రీకి వివేకీ !

౩౫ ఉన్నతిఁ గోరన దుష్టుం
డెన్నఁగ దనవారినేని హింసించుఁ గదా
చెన్నుగ బలిసిన చేఁపలు
పిన్నల మ్రింగుచును బ్రతుకవే సువివేకీ!

౩౬ కోరిన కోరక యున్నన్
ప్రారబ్ధం బెట్లు తప్పు భవనాశకుఁడౌ
గౌరీపతియును బిచ్చం
బారయ నెత్తండె జంగమగుచు వివేకీ!

౩౭ అడిగిన లేదన కర్థికి
నిడువాఁడును, చేయిచాచి యితరుల నెన్నం
డడుగని వాఁడును ధన్యులు
కడు దుర్బలు లన్యజనులుగారె వివేకీ!

౩౮ మేరువు నెత్తఁగవచ్చును,
వారిధి నంతయును ద్రావవచ్చును, లోభిన్
జేరి మదికరుగఁ జేయఁగ
నేరం డెవ్వాఁడు ధారుణిన్ సువివేకీ!

౩౯ స్థానము విడచిన మూర్ఖుఁడు
స్థానాంతర మొందనట్టి సద్విద్వాంసుం
డేనాటికైన వెలయుం
గా నేరరు నఖ దరముల కరణి వివేకీ!

౪౦ ఎంతటి యవమానములకు
వంతను గొనరెపుడు మంచివ్యాహృతిఁగాభా
వింతురు కుజనులు, తన్నిన
యంత పెరుఁగు పృచ్చకాయ యట్లు వివేకీ!

౪౧ ధనవంతున కేమనమునఁ
దనివియుఁ దత్కారణమునఁ దగునారోగ్యం
బును గల్గఁగాన కర్జము
ధనమార్జించుటయు మనుజతతికి వివేకీ!

౪౨ ధనమార్జించుట కర్జం
బని పరులకు హానిగల్గఁ వనులొనరింపన్
మనుజుండీ హపరముల యం
దును దుఃఖమునొందు నిజముతుదకు వివేకీ!

౪౩ ఎంతటి విపత్తులును ధీ
మంతుఁడు భరియించు నిందమాత్రింబోర్వం
డంతటి సీతను రాముఁడు
కాంతారమునందుఁ ద్రోసెఁగాదె వివేకీ!

౪౪ నీతి విదూరునితో బుధు
లేతర్కము నైన సేయుటెన్నఁగ ధాత్రిన్
రోఁత పయిఁగొట్టి చిమ్మిన
భాతియగున్ గాన చేయవలదు వివేకీ!

౪౫ పరదేశ కాంతఁజూచే దు
ర్మరణముఁన్ సల్పువారి రణధీరునిఁగా
పరిగణన సేయుదురు దు
ర్భరనీచుఁడు స్వార్థపరుఁడు వాఁడు వివేకీ!

౪౬ తానెఱుఁగు విద్యకోరిన
వానికిఁ జెప్పనినరుండు; వాఁకొని కపటం
బూనిన మనుజుఁడు దుర్భర
మహానరకము ననుభవింతు రవని వివేకీ!

౪౭ ఒరులెంత వారలైనన్
దురితారూఢునిగఁ జేయు దుష్టుం డెపుడున్
సరసాన్నము లెవియిడినన్
నిరసింపక రోగిమెచ్చునే సువివేకీ

౪౮ ఆపదల తప్పఁడగు తఱి
దీపించు పసిండి పోలికఁ ధీరుం డెపుడున్
ప్రాపగు సిరులంగరఁగును
తాపిత నవనీతమట్లు ధరణి వివేకీ!

౪౯ తక్కువ నరునింగను గాని
వెక్కసపడనేల నొక్కవేళనతండే
అక్కఱగు; వలనుసింగము
చిక్కఁగనారయుడె యెలుకచేరి వివేకీ!

౯౦ ఎంచఁగ కులటల ధనమా
ర్జించుట, సతిప్రేమఁజూడకే హీనాత్ముల్
లంచముఁదిను నధికారికి
వంచకులున్ హితులుగారె వసుధ వివేకీ!

౯౧ సుజనుల సాంగత్యమునన్
కుజనులు నున్నత పథంబుఁ గొనఁగలరెపుడు
ప్రజాపతి శిరంబెక్కదె
నిజముగ దారంబు మణులనిల్చి వివేకీ!

౯౨ వేడిన నర్థికిఁ బెట్టక
వేడుక భుజియించునట్టి వెడఁగుల బ్రతుకుల్
చూడనమేధ్యమ్ములఁదిను
క్రోడంబుల బ్రతుకయగును కొసకు వివేకీ

౯౩ అర్థము తెలియని చదువును,
అర్థికిఁ బెట్టంగ లేని యైశ్వర్యంబున్
సార్థకముగాని వ్యయమును
వ్యర్థంబగుగాదె తెలియ వసుధ వివేకీ!

౯౪ ప్రతిఫలము గోరు దానము
శ్రుతి పక్వముఁగాని గాత్రసుఖమును, ప్రేమో
న్నతిలేని చెలిమి, జిహ్వకు
హితకరముంగాని భోజ్యమేల వివేకీ!

౫౫ సభలో మెచ్చని చదువును,
అభిమానములేని జీవితాలోకనమున్
వ్యభిచారిణి పొందును, సా
రథహీన సుమంబు లేలరా సువివేకీ

౫౬ క్రోధికి నధికారంబును,
వ్యాధిగ్రస్తునికి భోగవాంఛయు, విద్యా
సాధకునకు సంసారము
బాధకములు గావె తెలియఁ బలుక వివేకీ!

౫౭ వినయంబు లేని చదువును,
తన ప్రజలం గావలేని ధరణీపతియున్,
రణభీరువైన భటుఁడున్
మనసీయని పత్నియేల మహిని వివేకీ!

౫౮ తృప్తిని బొందని గురుఁడును
సుప్తింగొను ఘోటకంబు, సొంపుగ విద్యా
వ్యాప్తి రహించని సుదతియు
ప్రాప్తించిన ఫలముఁ బొందవశమె వివేకీ

౫౯ దేవుని కాకృతి గలదే
భావింపఁగ నెవఁడు సుగుణ భరితుండతఁడే
దేవుఁడు గావున రాముని
భావించిరి దేవుఁడనుచు ప్రజలు వివేకీ!

౬౦ కనుఁగొనఁగా ప్రకృతియె, దే
వునికాలయమనఁగ నరులు పుడమినిఁగట్టిం
చిన గుడిమాత్రమె దేవుని
యునికి యనుట భ్రాంతిగాదొకోసు వివేకీ!

౬౧ సిరిసంపదలం బొందఁగ
నరుఁడొక యాకృతిని మదినినమ్మి భజించున్
వరుసన్ దత్కారణమున
వరలెను దేవతలపేళ్ళు వసుధ వివేకీ!

౬౨ తనయాకృతి దైవమునకు
మనుజుఁడు గల్పించి సగుణమతిఁ బూజించున్
తనవలె తక్కినజంతువు
లనుకొనవే జ్ఞానమున్ననటుల వివేకీ!

౬౩ తగునిది తగదను జ్ఞానము
జగతిని దైవంబొసంగె జనులకు సృష్టిన్
తగురీతి పనులసల్పక
భగవంతుని లీలలనుసుపాపి, వివేకీ!

౬౪ మంచియు చెడ్డయు నెఱిఁగిన
అంచిత సువివేక మాత్మయందు రహింపన్
మించి సుఖదుఃఖములు ప్రా
ప్తించఁగ హేతువు స్వకర్మవితతి వివేకీ!

౬౫ గుణరహితుండగు వేల్పును
వినుతించుట, మెచ్చుననుట వెఱ్ఱితనంబౌ
తను వెత్తినందు కార్తుల
ననయము సాకుట యొకర్జమగును వివేకీ!

౬౬ మనమును దమింపఁగాఁ గో
రిన రూపము దోఁచి సంతరించును ఫలముల్
అనుమానమేల దైవం
బనఁగాఁ గనరానితత్త్వమగును వివేకీ!

౬౭ మానసశక్తికి మించిన
దీనిఖిల జగానఁ గలదె? యెల్లవిభూతుల్
మానులు గాంచిరనంగా
మానస పటుశక్తి గాదె మహిని వివేకీ!

౬౮ కర్మత్యాగికి మోక్షము
ధర్మత్యాగునకు నరక దారిద్ర్యంబుల్
నిర్మలమతి కిహపరముల
నర్మిలి సౌఖ్యములు కొదువయగునె వివేకీ!

౬౯ కోరికల దీర్చుకొనుటకు
సూరిజనుల్ దైవమునకు సొంపుగ నెన్నో
పేరులు పెట్టినుతించెద
రారయునారూపు నిక్కమగునె? వివేకీ!

౨౦ కనుగుడ్లనొక్క జిలజిల
కనఁబడి యెదుదృష్టిచలన కాంతుల బ్రహ్మం
బని చెప్పుకల్ల గురువులఁ
గని మోసము నొందఁబోకు కడఁగి వివేకీ!

౨౧ తమకనుల వేడ్కఁదీరఁగ
సుమజాలముతోడ పూజ సొంపుగ జేయన్
తమ హృదయస్థితమాలి
న్యము వీడమి వేల్పు మెచ్చునా సువివేకీ!

౨౨ జగతిని బీజోత్పత్తికి
తగు కారణమైన పుష్పతతి కుత్తుకలన్
తెగఁగోసి పూజసల్పిన
భగవంతుండెట్లు తృప్తి పడును వివేకీ!

౨౩ ధ్యాన తపశ్శాంతి దయా
జ్ఞానేంద్రియ నిగ్రహమును. సత్యము, క్షమ, మా
సూనాహింసయు ననెడి ప్ర
సూనంబులనలరు వేల్పుసుమ్ము వివేకీ!

౨౪ ఎవరెట్లు నమ్మిగొల్చిన
భువినాతని కట్లుదోఁచి ప్రోచును దైవం
బవివేకత సందియమున
భవనాశంబందఁగలఁడె పాపి, వివేకీ!

౭౫ పశుపతిని దృప్తిపఱచఁగ
పశువుల హింసింపఁ దానఫలమెటు కల్గున్
శిశువుల బలియిచ్చినచో
పశుబాధలు మదికి తెలియఁబడును వివేకీ!

౭౬ హింసాత్మక యజ్ఞముల,న
హింసాత్మకమైన మోక్షమెట్లు లభించున్
మాంసాశను లగువారి క
హింసాతత్త్వమ్ము సాగుటెట్లు వివేకీ!

౭౭ మనుజుని జంపిన హంతకుఁ
డని దెగడుదు రెల్లవారు నవనిప్రతిదినం
బును లెక్కలేని జంతువు
లను జంపుట తగునె మర్త్యులకును వివేకీ!

౭౮ తనకుగల దానితోఁదృ
ప్తినిఁబొందఁగ వలయుననుచు ధృతిపౌరుషహీ
నుని కెట్లు ఫలముగల్గుట
పనిసేయమి దైవమిడునె ఫలము వివేకీ!

౭౯ వేదములందఱుఁ జదువఁగ
రాదని. గుడిలోని కేఁగ రాదన నేలా?
భేదములు స్వార్థపరమత
వాదకులకె? దైవమునకె? వసుధ వివేకీ!

౮౦ భావము ప్రాధాన్యంబగు
భావింపఁగ పనుల; శిశువు వనితాకుచముల్
దా వేడ్కఁ బట్ట పాలును,
యావనులుంబట్టు కామమొదవు వివేకీ!

౮౧ మనసోదరులగు నాహరి
జనులను మూర్ఖతను తాఁకఁ జనదందు రసీ!
చనునే నీచమృగంబుల
తనువుల భక్షింప మనుజ తతికి వివేకీ!

౮౨ మాలయన నేది రక్తము?
తోలా? అస్థికల? బుద్ధితోఁ జర్చింపన్
శీలమును వీడు మనుజుఁడు
మాలయనుచు నాత్మ తెలియుమా సువివేకీ!

౮౩ కులహీనులకున్ బుద్ధులు
విలసిల్లవు నిక్కమనుట వెఱ్ఱితనంబౌ
తలపఁగ బురదఁ జనించిన
తెలిదమ్ములు సౌరభములు తెలియుమ వివేకీ!

౮౪ తనకుల వృత్తి వీడుట
యనున దధర్మంబటంచు నండ్రియ్యది దే
వుని శాసనమే? బ్రతుకుం
గను తెలువులు వృత్తులయ్యెఁగాదె వివేకీ!

౮౫ తగినది, తగనిది ధర్మం
బగునని స్వార్థత్వ బుద్ధులవసిని శాశిం
పఁగ గ్రుడ్డి త్రోవలంజన
నగునే విద్యాధికులకు నవని వివేకీ!

౮౬ వరదేశకాల పాత్రము
లరసి మహాత్ములు ధర్మమువనిని నిల్పన్
స్థిరబుద్ధి నాచరింపమి
నరులకు నిహసుఖము గల్గునా సువివేకీ!

౮౭ తానెఱుఁగు నదియెధర్మం
బానని భావించువాఁడ యంధుఁడు జగతిన్
మాను గవిశాల సృష్టిని
జ్ఞానమతిన్ చూచి తెలియఁజనును వివేకీ!

౮౮ కతలను, నితిహాసంబుల
నతియుక్తిని గడుచువారలగు విద్వాంసుల్
మతశాస్త్రంబుల ఁజొప్పిరి
ధృతిని వివేకించి తెలిసి తిరుగు వివేకీ!

౮౯ ధరణి నహింసా సత్యము
లరయుట యేనరుల కెప్పుడగు ధర్మంబై
పరికింప జాతిమతస
స్ఫురణంబు ధీజనుల పసులుగావె? వివేకీ!

౯౦ పరిసరము ననుసరించియె
వరలును విజ్ఞానమందు వలన ఫలంబే
స్థిరమనుట యెట్లు నరులకు
ధరణిని నొకవృత్తి శాశ్వతంబె వివేకీ!

౯౧ రంగుగ సంఘోన్నతికిన్
భంగము లేకుండు ధర్మపద్ధతులను భూ
రంగమున ధర్మమందురు
ఇంగిత మతిధర్మయుక్తి నెఱుంగు వివేకీ!

౯౨ భూరి సుమతులారోగ్య ప్ర
చారము కాచారమనెడు సత్సూత్రములన్
నేర్పునఁ జేసిరర్ధము
నారసి వర్తింపమేల యగును వివేకీ!

౯౩ నరకంబన వేరున్నదె?
తిరిపంబెత్తి నను దినము దీరని కడు దు
ర్భర రోగభీత దుఃఖా
కరమగు సంసృతియె సుమ్ము కనఁగ వివేకీ

౯౪ మతమను పేరన నర్ధము
లతిశాఠ్యమున ద్రోహులగు చదువుకలీ
క్షితిశాస్త్ర దృష్టిఁ జేసిరి
ధృతి కర్మార్థమును దెలిసి తిరుగు వివేకీ!

౯౫ కామినితో సురత సుఖం
బే మనుజులు ప్రేమయనుచు నెంతురు భువిలో
నేనుల కన్యోన్యసహా
యామోదము ప్రేమయనుచు నరయు వివేకీ!

౯౬ వికలాంగులకు, కళోపా
సకులకుఁ జేఁజాచియుడుఁగఁ జాచకయున్నన్
ప్రకటితముగ నర్థము గొం
కకయిడవలెఁ దనకుఁ దగిన కరణి వివేకీ!

౯౭ లలితకళల్ సహజాతము
లిల నేరికినఁ బ్రియత్న మెటు ఫలియించున్
వలయాకృతిఁ గల్గిన కు
క్కలతోఁ గల పరిగ సేయఁగలమె వివేకీ!

౯౮ జనములు కర్మఫలంబుల
ననుభవఁగ జన్మములనేక మందెదరనఁగా
మనుజులై పితృదేవతలై
మనెదరు దివిననుట నిక్కమా? సువివేకీ!

౯౯ మనజన్మంబునకును జీ
వన భృతికిని గారణంబు వారలయగుటన్
జనని జనక కృతజ్ఞత
యొనఁబడు గదపైతృకంబు లవని వివేకీ!

౧౦౦ తనువులు మారుచు జన్మము
లను పుడమినిఁ బొందఁడనట ♦ యాథార్థ్యఁ బొ
సనుచో కర్మఫలంబుల
మనుజుఁడు వొందుట యథార్థమా సువివేకీ!

౧౦౧ చనిన మహాత్ముని సూత్రము
లను నాచరణంబు మాని ♦ లఘుతర బుద్ధిన్
వినుతించి వానిచిత్రం
బును బూజించుటయె కొట్టి పుడమి వివేకీ!

౧౦౨ ధన్యమతిన్ శ్రీ బగ్గాం
సన్యాసప్పన్న కవి ♦ విశాల హృదయుఁడై
మాన్యులు మెచ్చఁగ వ్రాసెను
అన్యాలోచనము సేయకు కరయు వివేకీ!

౧౦౩ స్వస్తి సమస్తమతాలకు
స్వస్తి కళోపాసకులకు ♦ సద్ధర్మలకున్
స్వస్తి జగత్సంస్కర్తకు
స్వస్తి సర్వమనుజ తతికి స్వస్తి వివేకీ!

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

శ్రీ రామానుజ విలాస పవరు ప్రింటింగు వర్కుస్సు,
విజయనగరం.

# విశారదగ్రంథమాలా ప్రచురణములు

| ముద్రితములు | రు-అ-పై |
|---|---|
| 1. చిత్రకేతూపాఖ్యానము (హరికథ) | 0- 8-0 |
| 2. జడభరత చరిత్రము (హరికథ) | 0-12-0 |
| 3. భక్తకల్పాగము | 0- 6-0 |
| 4. వివేక కౌముది | 0- 4-0 |

అముద్రితములు

1. గిరిజాపరిణయము (హరికథ)
2. మత్స్యావతారము (హరికథ)
3. శ్రీ సత్యనారాయణ వ్రతమహాత్మ్యము (హరికథ)
4. తిన్నఁడు (అచ్చతెలుఁగు) (హరికథ)
5. విశ్వసౌభాగ్యము (ఖండకావ్యము)
6. స్వతంత్రం జాతీయగేయము

---

ముద్రితప్రతులు వలయువారు

బగ్గాం సన్యాసప్పన్న కవి

(భాగవతార్)

రామభద్రపురం

P. O బోనంగి (Via) విజయనగరం B. N. Rly.